క్లుప్తంగా

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడ పరిధి చేపల దిబ్బడపాలెంలో జీవీఎంసీ నిధుల నుంచి రూ. 24లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు గురువారం వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు శంకుస్థాపన చేశారు. గతంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి డ్రైనేజీ సమస్యను తీసుకురావడంతో నిధులు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి అవకాశం కల్పిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల గురువారం తెలిపారు. చరిత్ర, రసాయన శాస్త్రం, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్ట్‌లకు అధ్యాపకుల కొరత ఉందన్నారు. ఈ నేపథ్యంలో గెస్ట్ లెక్చరర్లను నియమించాలని నిర్ణయించామన్నారు. ఆయా సబ్జెక్ట్‌ల్లో కనీసం 55 శాతంతో ఉత్తీర్ణత సాధించినవారు అర్హులని తెలిపారు. అలాగే ఎస్‌ఈటీ, ఏపీఎస్‌ఈటీ, ఎస్‌ఎల్‌ఇటీల్లో పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన వారు ఈనెల 25వ తేదీన ఉదయం పది గంటలకు కళాశాలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్‌పై శిక్షణ

కొమ్మాది: విద్యార్థినులకు శారీరక ఆరోగ్యం, నెలసరి సమయంలో ఎదురయ్యే సమస్యలు, యోగా, సుదర్శన క్రియలపై అవగాహన కలిగిస్తూ జవహర్ నవోదయ విద్యాలయలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ కె. సంజయ్ తెలిపారు. షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి సీనియర్ టీచర్ టి.అరుణకుమారి ఆధ్వర్యంలో రోజూ మూడు గంటలపాటు తరగతులు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ టి.గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరం


విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: మున్సిపల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద గురువారం విద్యార్థులకు సంగివలస అనిట్స్ వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హౌస్ సర్జన్లు చాందిని, హంసిత, దివ్య, జమీల బేగం ఆధ్వర్యంలో 160 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్.సింహాచలం, ఉపాధ్యాయులు వెంకటరావు, సుజాతకుమారి, అల్లాడి శ్రీనివాసరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు విశాఖ రూరల్ మండలంలో 'జగనన్నకు చెబుదాం'

మధురవాడ: ప్రజా సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమం శుక్రవారం విశాఖ రూరల్ మండలం జీవీఎంసీ 6వ వార్డు అవంతి ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. ఉదయం 10గంటలు నుంచి కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు.

కల సాకారం

- అందంగా రూపుదిద్దుకుంటున్న జగనన్న కాలనీ
- ప్రారంభోత్సవానికి శరవేగంగా ఏర్పాట్లు
- పేదలకు ఎంతో విలువైన స్థలం కేటాయింపు
- ఆనందపురం లేఅవుట్‌లో పూర్తయిన నిర్మాణాలు
- విద్యుత్, ఇంటింటికీ కుళాయిలు విశాలమైన రహదారుల నిర్మాణం


కాలనీ ప్రవేశ మార్గం వద్ద ఏర్పాటు చేసిన ఆర్చ్


నిర్మాణం పూర్తి చేసుకున్న ఇళ్లు

ఆనందపురం : రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు పథకాల్లో భాగంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీలు అద్భుతంగా రూపుదిద్దుకున్నాయి. మండలంలో చాలా గ్రామాల్లో కాలనీలు దాదాపు పూర్తయ్యాయి. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశంతో జిల్లా స్థాయిలో ఆనందపురంలోనే కాలనీల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొండవాలు ప్రాంతంలో ఆనందపురం జగనన్న కాలనీ ఎంతో అందంగా రూపుదిద్దుకుంది. ఆనందపురం జంక్షన్‌కు ప్రభుత్వ కార్యాలయాలకు కూతవేటు దూరంలో జట్లమ్మ కొండ ప్రాంతంలో సుమారు రూ.20 కోట్ల విలువైన స్థలాన్ని కాలనీ ఇళ్ల నిర్మాణం కోసం పేదలకు కేటాయించారు. ఒక్కొక్క ఇంటికి 70 చదరపు గజాల స్థలం కేటాయించగా దాని విలువ సుమారు రూ.15 లక్షల వరకు ఉంది. ఆనందపురం సర్వే నంబరు 276లో జట్లమ్మ కొండ ప్రాంతంలో జగనన్న కాలనీ కోసం 2.72 ఎకరాలను కేటాయించారు. అక్కడ 102 మంది లబ్ధిదారులకు స్థలాలను అందజేసి ఇళ్లను మంజూరు చేశారు. పనులు ప్రారంభించిన లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందించడంతో 90 శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. అన్ని ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు వీధిలైట్లను, ప్రతి ఇంటికి కుళాయిని ఏర్పాటు చేశారు. ఇళ్ల మధ్యలో విశాలమైన రోడ్లను నిర్మించారు. లబ్ధిదారులు ఇంట్లోకి ప్రవేశించే నాటికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. కాలనీ ప్రవేశ మార్గం వద్ద అందమైన ఆర్చ్‌ను నిర్మించారు. ప్రధాన రోడ్డును తారు రోడ్డుగా మార్పు చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతానికి కొత్తకళ సంతరించుకుంది. దీంతో ఇళ్ల ప్రారంభోత్సవానికి లబ్ధిదారులు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ విషయమై గృహ నిర్మాణ శాఖ మండల ఏఈ శ్యామ్ సుందర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్లను నిర్మించి కాలనీలో అన్ని సౌకర్యాలు కల్పించి ప్రారంభానికి సిద్ధం చేశామన్నారు. కాలనీలో పెద్ద ఎత్తున మొక్కలు పెంపకం చేపడతామని వివరించారు.


కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు


ఇంటి వద్ద ఏర్పాటు చేసిన కుళాయి


నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మారికవలస విద్యుత్ సబ్ స్టేషన్ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎమ్ 11కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు, విద్యుత్ లైన్‌లు కింద ఉన్న చెట్లు కొమ్మలు తొలగింపు పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని విశాఖ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు చెప్పారు. ఉదయం 9గంటలు నుంచి మధ్యాహ్నం 3గంటలు వరకు మారికవలస జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, పీపీ 2 కాలనీ, పెట్రోల్ బంక్ ఏరియా, శారదానగర్, తిమ్మాపురం రోడ్, ఓం కాస్ అపార్ట్‌మెంట్, గాయత్రి హాస్పిటల్, వైఎస్సార్ కాలనీ, వికలాంగుల కాలనీ, కార్పెంటర్స్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పీఎంపాలెం పరిధిలో...

పీఎంపాలెం: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని బక్కన్నపాలెం ఫీడర్ ఏరియాలో విద్యుత్ లైన్ల నిర్వహణ, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ సిద్దార్థనగర్, సృజనా లేఅవుట్, సాండ్ అండ్ సాండ్ లే అవుట్, హెచ్‌పీసీఎల్ లేఅవుట్, శంభువానిపాలెం, బీ-2 కాలనీ, లక్ష్మీవానిపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు.

ఓ బొజ్జ గణపయ్యా.. విభిన్న రూపాయ..!


చిల్లపేట సిగడాం మహాలక్ష్మి ఆలయం వద్ద ఈశ్వరుని రూపంలో వినాయకుడు


వాంబేకాలనీలో ఉయ్యాల ఊగుతున్న గణనాథుడు


గణేష్‌నగర్‌లో శ్రీకృష్ణ భగవానుడి నమూనాలో శంకు, చక్రధారిగా వినాయకుడు

తగరపువలస: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భీమిలి జోన్ రెండోవార్డు చిల్లపేట సిగడాం మహలక్ష్మి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం విశేషంగా ఆకట్టుకుంటోంది. శివుని రూపంలో వినాయకుడు చుట్టూ పార్వతి, బ్రహ్మ, విష్ణుమూర్తులు కొలువై పూజలు అందుకుంటున్నారు.

కుంకుమ లేపనం అలంకారంగా..

పీఎం పాలెం: స్థానిక ఆఖరు బస్టాపు నుంచి బక్కన్నపాలెం వెళ్లే రోడ్డులోగల శ్రీ శృంగేరీ శంకర మఠంలో కొలువు తీరిన సిద్ధి వినాయకుడు గరువారం కుంకుమ లేపనం అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు నాల్గవ రోజు సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.కార్యక్రమాన్ని మఠం గౌరవ ధర్మాధికారి జగర్లపూడి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

ఆకట్టుకుంటున్న గణనాథులు

మధురవాడ: ప్రజల్లో పర్యావరణంపై అవగాహన పెరుగుతోంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు స్థానంలో మట్టి, పర్యావరణ హిత విగ్రహాలు అత్యధిక మండపాల్లో దర్శనమిస్తున్నాయి. ఇందులో వాంబేకాలనీలో మట్టి గుడిసె, తాటి కమ్మల పైకప్పుతో పల్లెటూరి వాతావరణంలో మండపంలో ఉయ్యాల ఊగుతున్న గణపతి నమూనా ఆకర్షణగా నిలుస్తోంది. గణేష్‌నగర్ అల్లూరి సీతారామ రాజు కాలనీలో గత 20 ఏళ్లుగా ఫోర్త్ పీపుల్ టీమ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ శంకు, చక్రధారి అయిన శ్రీ కృష్ణ భగవానుడి నమూనాలో వినాయకుడ్ని ఏర్పాటు చేశారు. అలాగే మిథిలాపురి వుడా కాలనీ తదితర ప్రాంతాలలో మట్టి వినాయక విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక


కబడ్డీ ఆడుతున్న బాలికలు


ఎంపికైన నియోజకవర్గ స్థాయి టెన్నికాయిట్ జట్లు

భీమునిపట్నం: భీమిలి సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వివిధ పోటీలకు సంబంధించి నియోజకవర్గ స్థాయి బాలికల జట్ల ఎంపిక జరిగింది. భీమిలి, ఆనందపురం, పద్మనాభం, విశాఖ రూరల్ మండలాల పాఠశాలలకు చెందిన అండర్ 14,17 ఏళ్ల బాలికలు 530 మంది పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ క్రీడల్లో ఎంపికలు జరిగాయి. ఇక్కడ ఎంపికైన జట్లు త్వరలో జరగనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఎంపిక పోటీలు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు కె.సతీష్ పర్యవేక్షణలో జరగగా, సెయింట్ ఆన్స్ కోఆర్డినేటర్ సిస్టర్ దీప, మరియాగ్రేస్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం


తహసీల్దార్ శ్రీవల్లీని సన్మానిస్తున్న డీటీలు

పద్మనాభం: పద్మనాభం నుంచి గాజువాకకు బదిలీ అయిన తహసీల్దార్ టి.శ్రీవల్లీని పద్మనాభం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఘనంగా సన్మానించారు. డీటీలు కిశోర్ కుమార్, శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది శ్రీవల్లీని సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

డీఎల్‌సీసీ చైర్‌పర్సన్‌గా డాక్టర్ ఉష

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం సంచాలకురాలు డాక్టర్ పి.ఉష డిస్ట్రిక్ట్ లెవెల్ లోకల్ కంప్‌లైంట్స్ కమిటీ(డీఎల్‌సీసీ) చైర్‌పర్సన్‌గా రెండో సారి నియమితులయ్యారు.

ఈమె ఈ పదవిలో మూడేళ్లు కొనసాగనున్నారు. ఈమెతో పాటు ఇతర సభ్యులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మహిళలు పనిచేసే స్థలంలో లైంగిక వేధింపులు సంబంధిత ఫిర్యాదులపై ఈ కమిటీ విచారణ చేస్తుంది. ఈ సందర్భంగా డాక్టర్ ఉషను ఏయూ వీసీ ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు.

నిబంధనలు పాటించాలి


స్కూల్ ఆటోలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పీఎంపాలెం: నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని పాఠశాలలకు తీసుకువెళ్లే ఆటో డ్రైవర్లను ట్రాఫిక్ ఎస్‌ఐ మురళీకృష్ణ హెచ్చరించారు. పరిమితికి మించి ఆటోలో విద్యార్థులను తీసుకువెళ్లకూడదన్నారు. గురువారం సాయంత్రం కారుషెడ్ కూడలి నుంచి కొమ్మాది కూడలి వైపునకు వెళ్లే ఆటోలను తనిఖీ చేశారు.

స్తంభాలున్నా.. దీపాలు లేవు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు చిట్టివలస జడ్పీహైస్కూల్ రహదారిలో వీధి దీపాలు లేకుండా స్తంభాలు మాత్రమే ఉన్నాయి. వరుసగా ఈ స్తంభాలకు వీధిదీపాలు లేకపోవడంతో గుడివాడ అప్రోచ్ రోడ్డులో అంధకారం అలముకుంటోంది. ఇక్కడ అంగన్వాడీ కేంద్రం ముందు స్తంభానికి ఒక వీధి దీపం ఉన్నా వెలుతురు సరిపోవడం లేదు. జెడ్పీ బాలికల హైస్కూల్‌ను ఆనుకుని విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.


వీధి దీపం లేని స్తంభం

ఘనంగా గురజాడ జయంతి


గురజాడ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు


చంద్రంపాలెం హైస్కూల్లో గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు


మాట్లాడుతున్న బంగ్లామెట్ట పాఠశాల ఉపాధ్యాయుడు

పద్మనాభం: బీజేపీ మండల శాఖ కార్యాలయంలో గురజాడ అప్పారావు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ అప్పారావు చిత్రపటానికి బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పద్మనాభం మండల బీజేపీ, గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆర్.శ్రీనివాసరావు, ఉప్పాడ అప్పారావు, పి.కృష్ణారావు, పి.అప్పలరమణ, హెచ్.మహేష్ పాల్గొన్నారు.

చంద్రంపాలెం పాఠశాలలో..

మధురవాడ: ప్రజలను చైతన్య పరుస్తూ అనేక రచనలు చేసిన కవి, సంఘ సంస్కర్త గురజాడ అని పలువురు కొనియాడారు. గురువారం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురుజాడ జయంతని నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.ప్రియాంక, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజబాబు, యూటీఎఫ్ జిల్లా నాయకులు కె. నాగేశ్వరరావు తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ బి. మీనా, పిళ్లా. సూరిబాబు, ఐద్వా మధురవాడ జోన్ కమిటీ కార్యదర్శి బి. భారతి, అధ్యక్షులు కె.సుజాత, కె. పుష్ప, టీకే శారద, పి. పద్మ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో..

తగపువలస: చిట్టివలస శ్రీకృష్ణ జూనియర్, డిగ్రీ కళాశాలలో గురువారం గురజాడ అప్పారావు జయంతి నిర్వహించారు. శ్రీకృష్ణ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ బి.నరసింగరావు, ఐద్వా భీమిలి డివిజన్ కన్వీనర్ కె.నాగరాణి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ప్రియాంక, జిల్లా కమిటి సభ్యులు కుమారి, తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక పరివర్తనకు దోహదం

తగరపువలస: తెలుగు సాహిత్యంలో వాడుకభాష ఒరవడికి కృషి చేసిన వారిలో గురజాడ అప్పారావు ముఖ్యుడని భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. గురువారం పాఠశాలలో గురజాడ జయంతి నిర్వహించారు. తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన గొప్ప కవి గురజాడ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి, బుగత మల్లిక, సచివాలయ కార్యదర్శి అమ్మోజీరావు పాల్గొన్నారు.

- భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో గురజాడ జయంతి సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు జి.సత్యనారాయణ గురజాడ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అప్పలరాజుకు సత్కారం


అప్పలరాజును సత్కరిస్తున్న తల్లిదండ్రులు

తగరపువలస: ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్న జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజును గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. విధుల పట్ల అంకితభావం, స్వంత ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు, విద్యార్థుల సంఖ్య పెంపులో కీలకంగా వ్యవహరించారని తల్లిదండ్రులు కొనియాడారు. అందుకే రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ


ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట యూపీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వచ్ఛత సేవపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బహిరంగ మలవిసర్జన వద్దు, టాయిలెట్లను వాడుదాం, పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుదాం అంటూ నినాదాలు చేశారు.

ఎండాడలో అన్నదానం


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్థానిక నాయకులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ ఎస్సీకాలనీలో శ్రీ వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఇక్కడ ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారుగా 1500 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లాడ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గణపతి నిమజ్జనానికి దారేది?


బంగ్లామెట్ట గోస్తనీనదిపై శిథిల వంతెన వద్ద మార్గంలో పెరిగిన తుప్పలు

తగరపువలస: గోస్తనీనదిలో గణపతి నిమజ్జనానికి పలుచోట్ల పెరిగిన తుప్పలు అవరోధంగా కనిపిస్తున్నాయి. భీమిలి మండలంలో మజ్జివలస నుంచి మూలకుద్దు పంచాయతీ వరకు నదీ ముఖద్వారాల వద్ద విగ్రహాలను నిమజ్జనం చేస్తుంటారు. వీటిలో టి.నగరపాలెం, కొత్త మూలకుద్దు, చిట్టివలస జ్యూట్‌మిల్లు పూనిగట్టు వద్ద మినహా మిగతా ప్రదేశాలు అనువుగా లేవు. నదికి వెళ్లే మార్గంలో తుప్పలు పెరిగిపోవడం, వీధి దీపాలు లేకపోవడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఈ నెల 30 వరకు వందల సంఖ్యలో విగ్రహాలను నదిలో నిమజ్జనం చేయడానికి ఉత్సవ కమిటీల ప్రతినిధులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నదీ ముఖద్వారాల వద్ద ఆయా పంచాయతీలు, జీవీఎంసీ తుప్పలు తొలగించి మార్గం సుగమం చేయాలని ఉత్సవ కమిటీల ప్రతినిధులు కోరుతున్నారు.

విద్యార్థినికి అభినందన


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని రేష్మను అభినందిస్తున్న హెచ్‌ఎం గీతాదేవి

మధురవాడ: రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మధురవాడ వాంబేకాలనీలోని సునీల్ శర్మ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎంపికైంది. ఇక్కడ 8వ తరగతి చదువుతున్న పి.రేష్మ జిల్లా స్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై పలువురు అభినందనలు తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కె. గీతాదేవి, పీడీ అప్పలకొండ విజేతను అభినందించారు.